# కథ

# తాటి పెండెలో రాలిన సూర్యుడు

గోపాలరావు

ఊరికి దూరంగా తూర్పు దిక్కున ఉందా తాటి పెండె. దాని మధ్యలోంచి, తాటి చెట్టుపైకి కొద్ది కొద్దిగా ఎగబ్రాకుతూ అలసిపోయి మధ్యలోనే ఆగిపోయినట్లు ఎర్రటి సూర్యుడు. లేతఎండ పడి వసువు తెలుపు కలగలిసిన రంగులో మెరిసిపోతున్నాయి తాటి మట్టలు. తాటిమట్టల మధ్య గెలలు గెలలుగా కాయలు కనీకనిపించకుండా వేలాడుతున్నాయి. పెండె మధ్యలో ఒక తాటిచెట్టు క్రింద ఎప్పటి నుండో నల్లటి కుక్కొకటి మొరుగుతోంది.

"వొద్దన్నాను... నీరసతోటి ఎల్లొద్దు అని సెవుల యిల్లు కట్టుకోని సెప్పాను. నా మాట యింతేనా? ఎంతమరి సెని వొక్కరించిందో" అక్కడ చెట్టుమొదలు వద్ద ముసలావిడ తలపట్టుకొని గట్టిగా రాగాలు పెట్టి ఏడుస్తోంది.

అప్పటికే పెండె చుట్టూ చిన్నా పెద్దా జనం చేరారు. భయంగా వింతగా నోళ్లెళ్ల బెట్టుకొని పైకి చూస్తున్న వాళ్ళకి ఒక్కసారి ఒళ్ళు జలదరించినట్లయింది.

"తాతో...తాతా...?" హృదయ విదారకంగా గుండె వగిలేలా ఏడుస్తూ గింగుర్లెత్తిస్తోంది ఆమె మనవరాలు. ముసలమ్మ, మనవరాలు ఏడుపులు అందరి గుండెల్లో విషాదాన్ని నింపుతున్నాయి.

చెట్టుపైన తాటికమ్మల మధ్య ఒక శరీరం... రెండు కాళ్ళు తాటిమట్టలకు మలవేసినట్లుండి తల, చేతులూ మిగిలిన వరీరం వెనుకకు తలక్రిందులుగా వేలాడుతోంది.

xxx

మిట్ట మధ్యాహ్నం...

కిరణాలు నిలువుగా వడుతున్నాయి. సన్నగా, పొడుగ్గా కమ్మకొట్టిన తాటిచెట్టులాగ ఒకడు రోడ్డు పక్కన నిలబడి ఉన్నాడు. వడదెబ్బకు గిలగిల తన్నుకొంటున్నట్టుగా వాడి నీడ కాళ్ళ మధ్యకు చేరింది. వొళ్ళంతా చెమటతో తడిసి, తారురోడ్డు లాగ నల్లగ నిగనిగలాడుతోంది. మొలకు చుట్టిన తువ్వాలు తడిసి, వీస్తున్న వేడిగాలికి భారంగా రెపరెపలాడుతోంది. తాటిమట్టల్లాంటి అతని చేతులకు రెండు మూడు పాలథీన్ సంచులు బరువుగా వేలాడుతున్నాయి. మొహం ఎండిన తాటిబురికిలా ఉండి అందులోని లోతైనా కళ్ళు రోడ్డు మీద వచ్చీ పోయే వాహనంల్లోకి తొంగిచూస్తున్నాయి. వాహనాలు ఆగినపుడు "అరడజను ఐదు.. డజను పదీ.." అనే అరుపులు పెదాలు నుండి అప్పుడప్పుడు బయటకు వచ్చి "ప్చ్...లాబం లేదు" అనుకుంటూ ఆగిపోతున్నాయి.

"ఔన్రా నూకా... అలగే సేత్తావా? నీ కళ్ళు నెత్తికెక్కాయిరా? మొక్కలున్నావనీ సూడవా? సగానికి యిరిగిపోయిన జనపమొక్కల్ని సూత్తుంటే పేనం ఉసూరుమంతంది గావాల? నీకెన్ని సార్లు సెప్పాల్రా?" ధాన్యం నందకు తలపాగా చుట్టినట్లున్న నాయుడి మాటలకు తుళ్ళిపడి అటువైపు ఒక్కసారి చూశాడు. చూసి...

'కక్కుర్తి నా కొడుకు మళ్ళా తయారైపోండా? ఛీ..ఛీ.. యీడి గూదకి యిచ్చిత్తే సాలు. అప్పుడు మొక్కలు ఏటీ ఐపోవు. పెతీరోజు యిదొక సంత నాకు' అని మనసులో అనుకుంటూ వెనుదిరిగాడు నూకయ్య.

నూకయ్య నిలబడి ఉన్న చోటుకి కొంచెం వెనకన ఒక బుట్ట బోర్లించి ఉంది. దానిపైన గుడ్డ పరచి తాటి ముంజెలు అందంగా పేర్చి ఉన్నాయి. గంపకు కొంచెం వెనకన కూర్చోడానికి వీలుగా రెండు తాటిగెలలు అమర్చబడి ఉండి, వాటికి కుడివైపున కొన్ని తాటికాయలు, లేత తాటికమ్మలు, ఎడమవైపున కొన్ని తాటి బురికెలు పడి ఉన్నాయి. వాటికి ఆరేడు అడుగుల వెనకన ఒక కిరాణా కొట్టు, కిళ్ళీబడ్డీ, సైకిలుషాపు, టీ దుకాణం ఉన్నాయి.

నూకయ్య చేతులకు వేలాడుతున్న పాలథీన్ సంచులను బోర్లించి ఉన్న బుట్టమీద ఉంచాడు. తాటిగెల మీద కూర్చుంటూ ప్రక్కనున్న ఒక తాటికమ్మను తీసి దానిని 'బురిడీ'లాగా చేసాడు. తలపాగా నాయుడు రావడం, బేరాలు లేకపోవడం నూకయ్యకు చికాకు కలిగిస్తున్నాయి. మొహానికి పట్టిన చెమటను తువ్వాలు ఒక చెంగుతో తుడుస్తూ తాటి ముంజెలను 'బురిడీ'లో వేసి కడుతున్నాడు.

"యిక్కడ నేను అరుస్తుంటే.. ఏంద విరా.. ఉలకవూ, పలకవూ.." తలపాగా ఉరుముతోంది.

'తయారైపోనావు దారవతనాగా.. వూరిసికెలిపోడానికి' అని మనసులో కసిగా అనుకొని

"బావో..మీరే అలగంతే ఎలాగ? నేనెందల పడిపోవాల? అప్పుడికీ మొక్కల్లోన కాయలు

పడకుండ జేగర్తగానే కొడతన్నాను. కానీ పెండి అంచుని కొద్దిగా మొక్కలు కంగాలైపోనాయి. అలాగని తాటిసెట్టు మీద నుండి గెలగ్గెల కిందికి దించీగలనా? తఁ వరే కసింత గైపుచ్చుకోవాల" అని నూకయ్య తాటి ముంజెల 'బురిడీ'ని చేతికందించబోయాడు. అది తీసుకోవడం ఇష్టం లేదన్నట్లుగా కొంచెం సేపు నటించి

"సెపుతుంటే నీకు యిఁకటాల్లాగుందిరా.. యింకొక పాలి మొక్కల్లోన కాయలు పడితే వొప్పుకోను. నువ్వు గెలగ్గెలే దించుతావో.. మరేటి సేత్తావో" అంటూ తలపాగా నాయుడు దానిని అందుకొని అక్కడి నుండి కదులుతూ...

"యిదిగో.. నాలుగురెజులు సూత్తాను. సుబ్బరగ ముంటికంపలు తెచ్చి ఎలుగు పెట్టెత్తాను. అప్పుడు పెండిలోకి ఎలాగు ఎల్తావో సూత్తాను" అని గద్దించి విసురుగా వెళ్ళిపోయాడు.

'యీడు అనుకున్నంత పని సేత్తాడు. కాయలు సివరాకరికి వొచ్చేసాయి. నాలుగైదు రోజుల్లోన ఐపోతాయి. ఆ..కమ్మ కట్టడమే సికాకు.ఏదో వొకటి సేసి కమ్మ తెచ్చీయాల' అని అనుకొని బేరం కోసం ఎదురుచూశాడు నూకయ్య. 'వొక ఆటో ఐనా.. ట్రక్కరైనా వొస్తే బాగున్ను' అనుకున్నాడు. ఏదీ రాకపోయే సరికి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

'ఎఁవకల పెండికాడ్నుండి వొస్తున్నప్పుడు "నూకా.. అమ్మీ, ఆలపిల్లలూ వొచ్చారు. ముంజులు కొట్టేసి పంపించురా.." అని నాయిరాలమ్మ కవురెట్టిందా? ఆలకి కొట్టేసి పంపించానా? యిదిగో యిప్పుడీడికి... యీ రోజు లెగిసి ఎవుడి మొకంచూసానో, అన్నీ ఎవ్వచ్చి బేరాలే. పోనీ.. నాయిరాలమ్మకి యిచ్చానంతే అదొక దారి. ఆల తాటిపెండి కాయలు కొట్టుకొని బతుకుతన్నాను. ఆలు తిన్ని తరవాతే కదా నాకు నాయుడు బతికున్నప్పుడు "ఒరే నూకా.. పెండికాయలు కొట్టుకొని బతుకురా నీకు ఎంత వీలుంతే అంతే యిచ్చీరా. డబ్బులికి నిర్బంధనేటి లేదు, కానీ.. అమ్మీ, ఆల పిల్లలూ వొచ్చినప్పుడు మాత్రం ముంజులు పంపించెత్తుండు, ఎవులూ కమ్మకొట్టీకుండ కాయిదా సేసుకోరా" అని నాకు ఆ తాటిపెండిని వొప్పజెప్పీసాడు. అప్పుడ్నుండీ ఏదో.. యిలాగ బండి యీడుసుకొస్తన్నాను. కానీ యీ రెండు మూడు సమచ్చరాలు నుంచే అంతా మారిపోయింది. యీ సెంటర్లోన కొత్త కొత్త బడ్డీలూ, కొట్టులూ వొచ్చేసాయి. కొత్త కొత్త యేపారాలు వొచ్చి చేరాయి. యిప్పుడు నా యేపారమూ, నా ముంజులూ ఎవులిక్కావాల? (ఉబ్బర్న వొస్తాదని ఆ తలపాగా గాడికి మాత్రం కావాల) గతానికీ, యిప్పుడికీ ఎందుకింత తేడా? రోజులు మరాయా? మనసులు మారారా? లేకపోతే కాలంతోపాటు నానే మారలేదా? రోజంతా కాయలు కొట్టీ కొట్టీ అలిసిపోయిన అయ్య, తాటికమ్మలను బురిడీలుగా చేసి అందులో ముంజులు కట్టి అమ్మిన అమ్మ, తాటి ముంజులు నిండిన కావిడి సుట్టూ చేరిన జనం.. గతం కళ్ళముందు కదలాడుతుంటే నూకయ్య గుండె బాధతో నిండిపోయింది. వేడిగాలికి నిట్టూర్పొకటి వదిలి తాటి గెలలపై అలాగే కూర్చుండిపోయాడు.

నూకయ్య కూర్చున్న చోటుకి ఎదురుగా రోడ్డుకి అవతల వైపున కూల్‌డ్రింక్స్ అమ్మే బడ్డీ, దాని పక్కన ఒక టీపాక ఉన్నాయి. అవి వచ్చేపోయే జనంతో ఎప్పుడూ అలికిరిగా ఉంటాయి. పట్నంనుండి వచ్చే ఆటో ఒకటి ఇప్పుడు ఆ బడ్డీ ముందే ఆగింది. నూకయ్య ఆలోచనల్ని చెదరగొడుతూ. అటువేపు ఆశగా చూసేడు నూకయ్య, ముంజెలు కొనడానికి రాకపోతారా అని.

తాటిగెల నుండి ఒక్కొక్క కాయే విడిపోతున్నట్లుగా ఆటోనుండి కొందరు కాలేజీ స్టూడెంట్లు బయటపడ్డారు. జీన్ ప్యాంట్లు.. టీషర్టులు.. భుజాలకు తగిలించుకొన్న బ్యాగులు.. వాళ్ళను చూస్తుంటే కొడుకు గుర్తొకొచ్చేడు. గుర్తుకొచ్చి...

చిదిగిన తాటిముంజెల్లోంచి నీరు కారినట్లుగా కళ్ళలోంచి నీళ్ళు చెంపల మీదకు జారాయి నూకయ్యకు.

'కొడుకు...చెట్టంత కొడుకు'...' తనలా కష్టపడకూడదని వాడిని తాటి పెండి పైపైనా రానీయ లేదు. తాటి గెలల్ని నరకనివ్వలేదు. తాటి కాయల్నుండి ముంజల్ని తీయనివ్వలేదు. తాటి కమ్మను మడిచి 'గిడుగు' ఎలా తయారు చెయ్యాలో కూడా చెప్పలేదు. ఎండ తగిలితే కొడుకు తట్టుకోలేడని తాటి ముంజెలు అమ్మడానికీ తీసుకుపోలేదు. చదువుకొని బాగుపడాలని, ఏ కష్టమూ తెలియనివ్వలేదు. వాడికి ఉద్యోగం వస్తీదంటే తన బతుకు మారిపోతాదని కూతురు పెళ్ళిచేయగా మిగిలిన అరెకరా పొలం తగలబెట్టీసాడు.

కొడుకుది పట్నంలో ఉద్యోగం. బయట తినడానికి ఇబ్బంది పడుతున్నాడని, మంచి సంబంధం చూసి తొందరగా పెళ్ళి చేశాడు. పిల్ల మంచిది. నలుగురితో కలిసిపోతుంది. అత్త మామలు తమ వద్దే ఉండాలని ఆశించింది. పెళ్ళైన మొదట్లో ఒకసారి వూరు వచ్చినప్పుడు అత్తామామల్ని పట్నం తీసుకుపోదాం, వాళ్ళనెందుకు ఇంకా కష్టపెట్టడం, వాళ్ళని మన దగ్గరే ఉంచుకుందాం అని భర్తని వొప్పించాలని చూసింది. దానికి తన భర్త చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయింది.

"యిప్పుడు వీళ్ళని తీసుకుపోతాం. తరవాత పట్నంలో ఆ పనీ యీ పనీ ఉందనీ, పిల్లల చదువులనీ దగ్గిరోలందరూ చేరతారు. మన ఇంట్లోనే తిష్టవేసారు. అప్పుడు వాళ్ళని వెళ్ళమనలేము, ఉండమనలేము. ఆ బాధలన్నీ మనకెందుకు. నెలనెలా డబ్బులు పంపించిస్తే సరి. అయినా వాళ్ళొచ్చి పట్నంలో వుండలేరు కూడా". కొడుకు మాటలు చెవిలోవడ్డ తల్లి మనసొగ్గిసింది. అప్పటి నుంచీ మంచం పట్టీసింది. మొదట్లో నెలనెలా వందో రెండొందలలో



హైదరాబాద్‌లో వానమామలై వరదాచార్యులు గారి 99వ జయంతి సభలో 'మణిమాల' కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి. చిత్రంలో డా॥ఆర్.వసునందన్, వైద్య వినాయకరావు, కళావెంకట దీక్షితులు, మురళీధర్‌గౌడ్ తదితరులు..

పంపించే కొడుకు రానురాను అదీ పంపించడం మానేశాడు. రావడమూ మానేశాడు. తాటిపెండె.. తాటిగెలలు.. కాయలు.. ముంజెలు.. తాటికమ్మ.. గిడుగులు.. తాటినార.. ఇవే నూకయ్య ప్రపంచమయ్యాయి.

"తాటి ముంజెలు తిందాం పదండిరా.." అన్న మాటలు చెవిలోపడి ఆలోచనల్లోంచి బయట పడ్డాడు నూకయ్య. ఇందాకటి జీను ప్యాంట్లూ, టీ షర్టులూ.. కొన్ని యిటు లాగుతుంటే మరికొన్ని అటు లాగుతున్నాయి. నూకయ్య బుట్టమీద ఉన్న పాలథీన్ సంచులను తీసి గబగబా పరిగెత్తాడు "అరడజను ఐదు.. డజను పదీ.." అంటూ.

"ఏంటీ.. తాటి ముంజులా? వాటి తొక్కలు వొలుచుకొని, చేతుల నిండా మూతినిండా బంక చేసుకొని తింటావా? బట్టల మీద పడ్డాయంటే ఆ మరకలు మరి వదలవు. నా వల్ల కాదు బాబూ.. నేను కూల్‌డ్రింక్ తాగేస్తాను" ఒక ప్యాంటు అటు లాగింది.

"దమ్ముందా నీలో.." అంటూ ఇంకొక టీషర్టు అటే వెళ్ళింది. "బాబూ.. మీరు మాగా చదువుకున్నోల్లాగ వున్నారు.. మీకు తెలీని సంగతులుండవనుకో. నేనంటే పాత తరం మనిషిని. మీ అన్ని తెలివితేటలు నాకు లేవు. కానీ మాట చెబుతాను వింటారా? స్వచ్ఛమైన, ప్రకృతిలో దొరికే వాటిని వద్దనుకొని ఏవేవో రసాయనాల రంగునీళ్ళ కోసం ఎగబడుతున్నారు. ఆ డ్రింకులు తాగితే ఆరోగ్యానికి మంచిది కాదన్న విషయం మీకు తెలీంది కాదు. ఇక యీ తాటి ముంజెల సంగతి మీకేటి తెలుసు? ఒక్కటి నోట్లో ఏస్తే అవి ఐపోయిందాక ఎవరైనా వొదులుతారా? తిన్నన్ని తిని.. గ్లానుడు గంజి తాగీసామనుకో అరగదని బెంగలేదు. ముంజెలు తింటే ఎంత చలవో తెలుసా? వేసవిలోనే ఇవి ఎందుకు దొర్రుకుతాయో ఒక్కసారి ఆలోచించండి.ఇవి తింటే వొళ్ళు చల్లబడుతుంది. దాహం తీరుతుంది. కూల్‌డ్రింక్స్ తాగితే ఏటొస్తాది? వొలిచిన తాటి ముంజెల మీద పంచదార చల్లుకొని తింటే.. ఆహా.. హా.. ఆ రుచే వేరు" అని పిల్లలకి పాఠం చెప్పినట్టు చెప్పి,

"నూకా.. రెండు డజన్లు ముంజెలు యివ్వు. మనవలూ, మనవరాళ్ళు వచ్చారు. వాళ్ళకి తీసుకువెళ్తాను" అక్కడికి వచ్చిన రిటైర్డు టీచరు రాజారావు అడిగారు.

మబ్బు తొలగిన సూర్యకిరణాలు ఏటవాలుగా జారిపడి నూకయ్య మొహం వెలిగిపోయింది.

'పోన్లే.. యీ బావు ఐనా కొంతన్నాడు' అని అనుకుంటూ ముంజెలను రాజారావు చేతికిచ్చి చిల్లర తీసుకొని మొలకున్న 'జాలి'లో వేసుకున్నాడు నూకయ్య.

కూల్‌డ్రింక్స్ బడ్డీలో వాటర్ పేకెట్లు, డ్రింక్ బాటిల్స్ ఖాళీ అవుతున్నాయి. జీన్ ప్యాంటులు, టీ షర్టులు కులాసాగ తాగుతున్నాయి.

"బాబూ.. మనం కొన్న డబ్బుతో వాడికి ఒక పూట గడుస్తుంది. మన ఆరోగ్యానికీ మేలు కలుగుతుంది. డ్రింక్స్ వల్ల మన వొళ్ళు చెడి, వ్యాపారి మాత్రమే బాగుపడతాడు ఆలోచించండి.." రాజారావు యింటికి వెళ్తూ అన్న మాటలు విన్న కొందరు కుర్రాళ్ళు ఏమనుకున్నారో నూకయ్య వైపుకు వచ్చారు. కొన్ని తాటి ముంజెలు చెల్లాయి. నూకయ్య జాలిలోకి మరికొంత చిల్లర చేరింది.

రోజంతా క్షణం తీరిక లేకుండా నూకయ్యతో పోటీపడి పరుగుపెట్టిన సూర్యుడు అలుపు తీర్చుకోడానికా అన్నట్లు పడమటి కొండల్లోకి వెళ్తున్నాడు. కానీ నూకయ్య..?

మిగిలిన కాయల్ని బుట్టల్లో పేర్చి, కావిడికి కడుతుంటే నూకయ్యకు మనసంతా పీకినట్లయ్యింది. కావిడిని భుజాన కెత్తుకొని యింటివైపు నీరసంగా అడుగులు వేసాడు.

'వొకప్పుడు ముంజులేసుకొని ఏ వూరెల్లినా ఎలాగుండీది. రెండీదులు తిరిగేసరికి కావిడి కాలీ ఐపోయి, బుట్టలు బియ్యంతోని నిండిపోయీవి. "తాటి ముంజులో.." అని కేకేస్సరికి సేటల్తోని బియ్యం పట్టుకొని కావిడి సుట్టూ సేరిపోయేలు. ఏ రోజూ ఆకల్తోని వున్నామన్నది లేదు. నాకూ, నా ఆడదానికీ కడుపు మాడ్చుకోవడం అలవాటైపోయింది. కానీ మాకు తోడు మనవరాలు. దానికైనా రెండు ముద్దలు పెట్టాలి కదా? సచ్చిపోయి ఏ సొర్గాన వుందోగానీ దాని తల్లి, మొగుడు తాగుబోతోడని దాని తోవ అది సూసుకుంది. యిప్పుడు మనవరాల్లోనే కూతుర్ని సూసుకుంతన్నాను చిన్నప్పుడి నుంచే ఆలమ్మకి పెతీ పనిలోనూ సాయం సేసేది కూతురు. పెద్దయ్యాక వొక్క పనీ సెయ్యినిచ్చిది కాదు. పెళ్ళై అది ఎలిపోతేగాని ఆ లోటేదో తెలిసొచ్చింది కాదు.' కూతురు గుర్తుకొచ్చే సరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి నూకయ్యకు. ఆలోచనల భారంతో ఇంటికి చేరిన నూకయ్య, కావిడిని దించి పాక ముంజూరులోంచి లోపలికి దూరుతుంటే "తాతా.." అంటూ మనవరాలు ఎదురొచ్చింది.

"మీ అమ్మమ్మ నెగిని గెంజినీలైనా మరగబెట్టిందా? లేదా?" నులక మంచం మీద ముడుచుకు పడుకున్న భార్య తవిటమ్మను లేపబోయాడు.

"తాతా.. నానే బువ్వొండాన్రా.." అని మనవరాలు అంటుంటే తన కూతురే మాట్లాడుతున్నట్లు అనిపించి దగ్గరకు తీసుకున్నాడు. జాలిలోని చిల్లర డబ్బులోంచి రూపాయి నాణెం తీసి "యిద కొనుక్కో.." అని మనవరాలి చేతిలో పెట్టాడు.

"ఏం.. గాచ్చార మెచ్చిందో సూడు. ఆ పిక్కురుదాయి సేత్తేనే గాని మనదినం దీరకుంటుంది. ఏం పావం సేసుకున్నామో. ఆడికా.. మన మెక్కడున్నామో, ఎలాగున్నామో, ఏటౌతన్నామో కూడా అక్కర్లేదు. నలుగురూ ఏటనుకుంటారనీ బియ్యం లేదు. సచ్చిపోయి ఏటి సాదించిద్దమనో.. అది కాటి



హైదరాబాద్ త్యాగరాయ గానసభలో జరిగిన సభలో ప్రసిద్ధ గాయకుడు గంగాధర్‌కి జంధ్యాల పాపయ్యశాస్త్రి స్మారక పురస్కారం చేసి సత్కరిస్తున్న డా॥సి.నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, డా॥ఓలేటి పార్వతీశం, జి.వి.హరనాథ్ తదితరులు

కలిసోయింది. నేనా.. మంచం దిగలేకపోతన్నాను. మూతిమీద గెంజి పోసిన దిక్కులేదు. యింకెంత అనుబగించాలని రాసాడో. ఆ బగమంతుడు" అంటూ నూకయ్య భార్య లేవబోయి కిందికి తూలి పడింది. ఆమెకు దుఃఖం ఆగడం లేదు.

"నీతోని ఎప్పుడూ యిదేగోస. కొడుకూ.. కూతురూ అంతావు. ఆలు లేకపోతే బతకనేమంతావు. యిన్నాలూ ఆలే పెంచేరేటి? ఎందుకలగ మనసొగ్గెస్తావు? లెగు కసిన్ని మెతుకులు తిందువుగాని" భార్యను రెండు చేతులతో పట్టుకొని లేపాడు. మనిషి నీరసంగా ఉంది. లేచి నిలబడలేకపోతోంది. బొగ్గులు రాజేసిన కుంపటిలాగ ఒల్లు కాలిపోతోంది.

"జొరం మాత్ర ఏస్తావా? లేదా? రేపు పకీరుబావు వొస్తే యిండీసను సెయ్యిమని సెప్పాల" అని అలాగే మంచం మీద కూర్చోబెట్టాడు. అన్నంలో నీళ్లేసి మెత్తగా పిసికి తాగించాడు. మనవరాలు, తాను తిని మంచం పక్కనే క్రింద దుప్పటి పరుచుకొని పడుకున్నారు. నూకయ్యకు నడుము పీకుతోంది. ఒళ్ళంతా ఒకటే సలుపు. ఇటు నుండి అటు, అటునుండి ఇటు తిరిగి పడుకున్నా నిద్ర పట్టడం లేదు.

* * * * *

చీకటి తెరలు కొద్ది కొద్దిగా తొలగి వేకువ వెలుగురేఖలు ఊరిమీద పరుచుకుంటున్నాయి. అప్పటికే ఊరి మధ్య "టీ" దుకాణంలో పొయ్యి మీద "టీ" పొగలు కక్కుతోంది. నాలుగు రోజులుగా నూకయ్య టీ దుకాణం వైపు వెళ్ళలేదు. నీరసంగా ఉందని మంచం మీద నుండి దిగలేదు. టీ దుకాణానికి వెళ్ళకపోవడానికి నీరసమొక్కటే కారణం కాదు. టీ చుక్కలు గొంతులో పడితేనే గాని తెల్లవారని నూకయ్యకు యీ మధ్య మంచం మీదే తెల్లవారుతోంది. మంచం మీదే పొద్దుపోతోంది.

తవిటమ్మ నిద్రలేచి చూసేసరికి మంచం మీదలేడు నూకయ్య. తనని లేపకుండా ఎక్కడికెళ్ళాడో అని కంగారు పడింది ఆమె. పెరట్లో చింతచెట్టు మీదనుండి గుడ్లగూబ అరుపు వినిపిస్తోంది.

'ఎటెల్లాడో..? బయటకెల్లాలంతే మనవరాల్నైనా తోడు తీసికెల్లోడు. అదీ యింక తొంగోని లెగలేదు. వొకాల టీ దుకానంకి ఎల్లాడేటో? బాకీ పెరిగిపోతదని ఆయమ్మ గలాసు యిసిరీసింది. ఏ మొకమెట్టుకోని ఎత్తాడు? ముంజులు అమ్మినన్నాలూ ఎలాగో దినం దీరిపోయాది. యిప్పుడు బియ్యం గింజలు లేకపోయీ సరికి ఎవులికాడికైనా అప్పు అడగడానికి ఎల్లాడా? నా పిచ్చిగానీ, అప్పు ఎవులిత్తారు? అల్లాల్లాగ నెలనెలా పెన్సను అందుతుందా?

# నిశ్శబ్ద కాలుష్యం

**- కొండెపోగు. బి. డేవిడ్ లివింగ్‌స్టన్**

శబ్దం కాదు
నిశ్శబ్దమే ఇపుడు పెద్ద కాలుష్యం
ఇంటింటా రంగుల అంధకారం
నింగినుండి మనిషి చుట్టూ
జారుతున్న గోడలు
అంతా సౌండ్ ప్రూఫ్
ఎవరితో ఎవరికీ మాటల్లేవు.
ఉంటే గింటే వేడి చల్లార్చుకుందుకు
పన్నాగపు ఛాటింగులు తప్ప
ఎవరిలోకం వారిది కదా!
నెట్‌లు, సైట్లు మాటల్ని రద్దు చేశాక
బుల్లితెరలు, లాప్‌టాప్‌లు నోరు కుట్టేశాక
కంప్యూటర్లు కర్ఫ్యూ విధించాక
మిగిలేదేముంది? స్మశాన నిశ్శబ్దం కాక
గ్లోబల్ గ్రామంలో
ఇంకెక్కడి కిలకిలా రావాలు?
ఇపుడు మనిషి
దుర్భర శబ్దదారిద్ర్యంలో అలమటిస్తున్నాడు.
నాల్గుమాటల కోసం
ఆకలిగొన్న బిచ్చగాడైపోతున్నాడు

ఆటపాటల్లేని బాల్యాలు
కాంపిటేషన్ దుమారంలో కొట్టుకుపోతుంటే
పలకరింపు కరువైన వృద్ధాప్యాలు
ఆశ్రమాల్లో రోదిస్తున్నాయి
సామూహిక మూగతనం
వెంటాడే నిశ్శబ్దం
బ్రతుకుల్ని కేన్సర్లా కొరికేస్తుంది.
ఓ ఎండు కొమ్మకు
నిస్సహాయంగా వేలాడే
గబ్బిలమైపోయిన మనిషి
కరిచే నిశ్శబ్దం
విరిచే నిశ్శబ్దం
ఉక్కిరి బిక్కిరి చేసే
ఒకటే నిశ్శబ్దకాలుష్యం
గుడ్లుతేలేసి నిష్క్రమిస్తాడిక
పోస్ట్‌మోడర్న్ మనిషి
మాటల్లేని మరణంలోకి
సజీవంగా
అలంకృత సమాధిలోకి

ముసిలోల పెన్సను నా మొగుడు కొత్తాదని ఆశుందా? పోనీ డ్వాక్రా సంగంల వున్నానా? ఆమీ ఏటుందని అప్పు పుడతాది మాకు? అదా.. ఆమీ వుందనుకున్న వొక్క రేసును కార్డు పెట్టేసి తెచ్చిన మూడొందలూ, మా ఆలూ మొగులు ఇండీసన్లు, మాత్రలకే సరిపోయినాయి. వారం రోజులు తొంగున్న సోటు యింకొకలికి యివ్వకుండా మంచం మీద వుంతేగాని నెగలేకపోనాను. యిప్పుడు యీ నాయిన వొంతు. ఇవేం మాయిదారి వుష్టాలో.. వొత్తే నెల్లాలదాకా మనునులం అవ్వలేకపోతన్నాం. దేనికీ పనికిరాకుండా ఐపోతన్నాము' ఆలోచిస్తూనే ఇంటిలోనుండి బయటకు వచ్చింది తవిటమ్మ. గడపలో పడివున్న తాటినార తాడును చూసి 'ఎవులు దీన్ని యిక్కడ పడీసారు. గోడకి దోపేసి ఉండీది గావాల?' అని అనుకుంటూ చుట్టూ చూసింది. ఇంటి ముందు దొడ్లో రాయి మీద కత్తి సానపడుతూ కనిపించాడు నూకయ్య. మధ్య మధ్యలో చేతివేళ్ళతో కత్తి పదును చూస్తున్నాడు.

"వూష్టంగుందని మంచం దిగకుండ తొంగున్నావా? అది తగ్గనీకూడదా? కాయలు ముదిరిపోనాయట గదా? మరింకేల గాబర? రెండ్రోజులు తొంగుంతే వూష్టం తగ్గదా?" అంటూ నూకయ్య దగ్గర కత్తిని లాక్కోబోయింది. అతని చేయి సన్నగా వణుకుతోంది.

"జరిగొత్తే జొరమొచ్చినంత సుకం లేదంటారు. అది జరిగినోల సంగతి. మనలాటోలు తొంగుండిపోతే పూట గడుత్తాదేటి? నువ్వూ ఎటెల్లకపోతే, నానూ ఇంట్లోనే ఉండిపోతే దాన్నెవులు సూత్తారు. మనవరాలికైనా రెండు ముద్దలు పెట్టాలి కదా? వుండు.. గబీనెల్లి నాలుగు కమ్మలు కొట్టుకోని వత్తాను. తరవాత తాపీగ 'మదేస్సి' బరువెత్తీయొచ్చు" అని తాటి పెండెకి బయలు దేరబోయాడు నూకయ్య.

"ఆ సెయ్యి నూడు... ఎలాగ వొనుకుతందో. యిప్పుడేటి మించిపోతందని కమ్మ కొట్టీడానికి తయారైపోతన్నావు? తరవాత కొట్టొచ్చులే. రా... రా..."

"అయ్యొచ్చీదాక ఆమాస ఆగుతాదేటి? యిప్పుడెల్లక పోతే మరి కమ్మకొట్టక్కర్లేదు. ఎలుగెట్టెత్తానని మొన్నే ఆ నాయుడు కత్తాయించి మరీ సెప్పాడు. వొస్తున్నది వర్సాకాలం. ఉడుపులు, దమ్ములు టయానికి గిడుగులు అల్లుకోమా?"

'కమ్మకొట్టీసి ఏటి సెయ్యిడానికి? గిడుగులు అల్లీసి ఏటి సేసుకుంతాము? అసలు ఉడుపు గిడుగులూ, దమ్ము గిడుగులూ ఎవులు కొంతన్నారు? ఉడుపులూ, దమ్ములూ.. యీ పనులు మనుసులు సేత్తండ్రేటి? టాక్టర్లు తోటి దున్నించీడము, దమ్ము పట్టీడమూ... యిచ్చింతరం కాకపోతే యీ మద్దిన ఉడుపులకీ, కోతలకీ మిసన్లు వొచ్చీసినాయట. ఆ పన్లా మనునులు సెయ్యక్కర్లేదు. యిలగ అన్ని పన్లా మిసన్లే సేసిత్తే మనుసులేటి సేత్తారు?" మారుతున్న పరిస్థితులు తవిటమ్మకు ఆందోళన కలిగిస్తున్నాయి.

"వూరందరూ ఎలిగిపోయినట్టిగే మనమూ తట్టా, పారా పట్టుకొని పనికి ఆహారం పతకం పన్లకి ఎలిపోదుము. కులవుర్తి, మన పని వొగ్గేసి ఎలాగ ఎలిపోతాము అని నువ్వు ఎనక్కిలాక్కు. నీరస తగ్గిపోతే ఆ పనికే ఎల్లిపోదుము". ఎలాగోలాగ పూట గడవాలన్నదిఆమె ఆలోచన.

'యీ ముసిలిదాయి వొకర్తి... ఎప్పుడూ యిలాగే ఏదో వొకటి అనుకోనే వుంతాది. దీనూసేల' అని అనుకుంటూ నూకయ్య తలకు గుడ్డచుట్టి, మొలకు చుట్టిన చిరుగులు పంచెను ఎగ్గట్టాడు. తాడు తీసి భుజానికి తగిలించుకున్నాడు. కత్తిని ఒక చేత్తో పట్టుకొని టైరు చెప్పులు కాలికి తొడిగి యుద్ధానికి తయారైన సైనికుడిలా బయలు దేరాడు.

నూకయ్యకు అలవాటైన వనే అయినప్పటికీ తవిటమ్మకు భయం వేసింది.

* * * * *

నూకయ్య అడుగులు నెమ్మదిగా ఊరు దాటి పెండె దారిలో పడ్డాయి. దూరం నుండి పెండెను చూస్తుంటే గతం చెట్టు నుండి జ్ఞాపకాలు కమ్మలు ఒక్కొక్కటిగా జారి పడుతున్నాయి. ఆ జ్ఞాపకాల కమ్మలే రేపటి ఆశల గిడుగులని అతని నమ్మకం ఆలోచిస్తూనే పెండె చేరుకున్నాడు. చెట్లను ఒకసారి పరిశీలనగా చూసి ఏయేచెట్ల కమ్మకొట్టాలో మనసులోనే నిర్ణయించుకున్నాడు. ఒకటి రెండు చెట్లకు ముదిరిన తాటి గెలలు ఉన్నాయి. అతని దృష్టి పెండె మధ్యలో ఉన్న చెట్టు దగ్గర ఆగింది. మొదట ఆ చెట్టు కమ్మనే కొట్టాలని అనుకొని అటువైపు నడిచాడు. కాలికి ఉన్న చెప్పులు తీసి ఒక ప్రక్కన పెట్టాడు. పంచెను సిలకట్టులాగా బిగించి కట్టాడు. కత్తిని మొలకు దోపుకొని చెట్టు మొదలుకు దండం పెట్టాడు. భుజానికి వున్న తాడుని తీసి చెట్టుకు చుట్టాడు. దానిని తన వీపుకు ఆనించి కట్టుకున్నాడు.

అంచినీలు పెట్టకుండా పాము ప్రాకినట్టు ఎలాంటి తాటి చెట్టు మీదికైనా అవలీలగా ఎక్కిపోయే నూకయ్య ఈ రోజు అడుగడుక్కీ అంచినీలు పెట్టి చెట్టు ఎక్కలేక జాపోసిపోతున్నాడు. కాళ్ళు చేతులూ విలవిల్లాడేసి పట్టు కుదరడం లేదు. అతికష్టం మీద చెట్టు 'మోపు' పైకి మట్టలపైన కూర్చున్నాడు. కొంచెంసేపు అలాగే కూర్చుని అలువు తీర్చుకున్నాడు.

చిన్నగా వీస్తున్న గాలికి తాటికమ్మల చివర్లు రెపరెపలాడుతూ రూపాయి నోట్లులాగా కనిపించాయి నూకయ్యకు. కాంతి నిండిన కళ్ళతో వాటినే చూస్తున్నాడు.

'ముసిలిదానికి టానిక్కు కొనాల. బడిసెలవులు ఐపోతున్నాయి. మనవరాలికి పుస్తకాలు, బట్టలు కొనాల. టీ దుకానంల బాకీ ఎంతుందో సూసి, ఆయమ్మ మొకాన కొట్టీయాల. రేసను కార్డు యిడిపించీయాల... అవసరాలు ఒక్కొక్కటిగా కళ్ళముందు కదలాడాయి. నూకయ్య మొలనున్న కత్తిని తీసి గబగబా కమ్మలు నరికాడు. కొన్ని కమ్మలు కింద పడ్డాయి. మరి చేతిని పైకి ఎత్తలేకపోతున్నాడు. ఒళ్ళంతా చెమట పట్టి నీరసంగా ఉంది అతనికి. కింద పడ్డ కమ్మను చూసి ఉడుపు గిడుగుకి ఏభై, దమ్ము గిడుగుకి ముప్పై చెప్పున లెక్కబెట్టాడు. లెక్క తక్కువొచ్చింది. యింకో వది గిడుగులకైనా కమ్మ కొట్టాలనుకున్నాడు. శక్తినంతా కూడగట్టుకొని కత్తిని పైకెత్తాడు. రెండు కమ్మలు కొట్టాడు. చెయ్యి వణికింది. గుండె వేగంగా కొట్టుకుంది అతనికి ఎప్పుడూ లేని భయం కలిగింది.

భార్య గుర్తుకొచ్చింది. మనవరాలు గుర్తకొచ్చింది. కొడుకూ కోడలూ గుర్తుకొచ్చారు... నాకేమీ కాదు కదా అనుకున్నాడు అనుకుని రెండు కాళ్ళు తాటి మట్టలకు మెలవేసేడు. అతనిలో చివరి ఆశ ఆవిరైపోయింది. చేతులు పట్టు తప్పి శరీరం వెనుకకు జారింది. చేతిలోని కత్తి జారిక్రింద పడింది. తుప్పులోంచి ఒక పిట్ట రివ్వున ఎగిరిపోయింది.

నిస్తేజమై వేలాడే అతని రెండు చేతుల మధ్య.. తన అసహాయతకు చింతిస్తున్నట్టు తెల్ల మబ్బుల తెరల్లో వెలవెలబోతున్నాడు సూర్యుడు.

తెగిన 'తాటికమ్మ' చెట్టుకు వేలాడుతున్నట్టు అతని నల్లని శరీరం భూమ్యాకాశాల మధ్య తలక్రిందులుగా వేలాడుతోంది.. ప్రపంచాన్ని ప్రశ్నిస్తున్నట్టు.